రంజాన్ వేళలు

	ఇఫ్తార్(గురువారం)	సెహరీ(శుక్రవారం)
కర్నూలు	6:33 (సాయంత్రం)	5:04 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:30 (సాయంత్రం)	5:16 (ఉదయం)
ఆదోని	6:35 (సాయంత్రం)	5:07 (ఉదయం)



అసంపూర్తిగా నిలిచిపోయిన ఉర్దూ యూనివర్సిటీ



ఇదేనా విశ్వసనీయత..!

- సార్వత్రిక ఎన్నికలకు త్వరలో రానున్న షెడ్యూలు
- నేషనల్ లా యూనివర్సిటీ శంకుస్థాపనకు ఏర్పాట్లు
- నేడు టెంకాయ కొట్టనున్న సీఎం జగన్
- జగన్నాథగట్టుపై 150 ఎకరాల కేటాయింపు
- నిధులు మంజూరు చేయకుండానే హడావుడి
- జగన్ పదే పదే చెబుతున్న చిత్తశుద్ధి ఇదేనా?

'ఎన్నికలకు ఆరు నెలల ముందు అభివృద్ధి పనులను టెంకాయ కొడితే దానిని నమ్మకద్రోహం అంటారు.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో టెంకాయ కొడితే దానినే చిత్తశుద్ధి అంటారు...'
- 2019 డిసెంబరు 23న కడప జిల్లా ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన సభలో సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలివి!

లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ఐదారు రోజుల్లో ఎప్పుడైనా రావచ్చని అంటున్నారు. ఈ సమయంలో నేషనల్ లా యూనివర్సిటీ (ఎన్‌ఎల్‌యూ)కి శంకుస్థాపన ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. నేడు సీఎం జగన్ భూమి పూజ చేయనున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదేళ్లు పూర్తి కావస్తోంది. కర్నూలు న్యాయ రాజధాని అంటూ మూడు ముక్కలాటకు తెర తీసి ఏళ్లు గడుస్తున్నాయి. జుడిషియల్ క్యాపిటల్ ఏర్పాటు చేస్తామంటూ జిల్లాకు చెందిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రకటనలే తప్ప.. నిధులు, బాధ్యతలతో అడుగులు వేయలేదనే ఆరోపణలు లేకపోలేదు. ఎన్నికల షెడ్యూలు రావడానికి కొన్ని రోజులే గడువు ఉంది. ఈ సమయంలో ఓట్లు దండుకోవాలనే రాజకీయ స్వార్థంలో నేషనల్ లా యూనివర్సిటీ భూమి పూజకు సీఎం జగన్ సిద్ధమయ్యారు.

కర్నూలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారున కల్లూరు మండలం లక్ష్మీపురం రెవిన్యూ గ్రామం పరిధిలో జగన్నాథగట్టు కేంద్రంగా 250 ఎకరాల్లో జుడిషియల్ క్యాపిటల్ నిర్మాణం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పదేపదే చెబుతూ వస్తున్నారు. 2022 డిసెంబరు 6న ఎస్టీ బీసీ మైదానంలో జరిగిన రాయలసీమ గర్జన వేదికపై కర్నూలు నలువైపులు కనిపించేలా హైకోర్టు నిర్మిస్తామని మంత్రి బుగ్గన గొప్పగా చెప్పారు. ఏళ్లు గడిచిపోతున్నా హైకోర్టు లేదు.. జుడియల్ క్యాపిటల్ కట్టలేదు.. నేషనల్ లా యూనివర్సిటీకి పునాది తీయలేదు. ఎన్నికలు రాబోతున్న ఈ తరుణంలో లా యూనివర్సిటీ శంకుస్థాన పేరిట వైసీపీ నాయకులు, అధికారులు హడావుడి చేస్తున్నారు. జగన్నాథగట్టులో ఈ యూనివర్సిటీకి తొలి విడతలో 50 ఎకరాలు, రెండో విడతలో 100 ఎకరాలు కలిపి 150 ఎకరాలు కేటాయించారు. రాష్ట్ర మంత్రివర్గం కూడా ఆమోదం తెలిపింది. 2023 డిసెంబరు నెలలోనే సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారని నవంబరు 20న జగన్నాథగట్టును పరిశీలించిన మంత్రి బుగ్గన గొప్పగా చెప్పారు. అయితే ఆ దిశగా ఏమాత్రం అడుగులు పడలేదు. నాలుగైదు రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు షెడ్యూలు రానుంది. ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేస్తుంది. ఈ తరువాత కొత్తగా చేపట్టే పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు కోడ్ అడ్డంకిగా ఉంటుంది. దీంతో కోడ్ కూయక ముందే భూమి పూజ చేసి టెంకాయ కొట్టడానికి సీఎం జగన్ సిద్ధమయ్యాడు. అందుకే హడావుడిగా శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదేనా జగన్ చిత్తశుద్ధి..?

కడప ఉక్కు పరిశ్రమకు 3 వేల ఎకరాల్లో నిర్మించేలా మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె వద్ద 2018 డిసెంబరు 27న ఆనాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2019 మే 30న వైసీపీ ప్రభుత్వం కొలువుదీరి సీఎం జగన్ బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది డిసెంబరు 23న జమ్మలమడుగు మండలం సున్నపురాళ్ల పల్లె వద్ద సీఎం జగన్ రెండోసారి శంకుస్థాపన చేశారు. ఆనాటి సభలో మాట్లాడుతూ.. 'ఎన్నికలకు ఆరు నెలల ముందు చంద్రబాబు టెంకాయ కొడితే.. మన ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే నేను టెంకాయ కొట్టాను. ఇదీ విశ్వసనీయత అంటే! చంద్రబాబుది నమ్మకద్రోహం..' అంటూ స్పందించారు. ప్రస్తుతం ఎన్నికకు షెడ్యూలు రావడానికి కొన్ని రోజులే గడువు ఉంది. ఈ సమయంలో కర్నూలు కేంద్రంగా నేషనల్ లా యూనివర్సిటీ నిర్మాణానికి నేడు సీఎం జగన్ శంకుస్థాపన చేసి కొట్టనున్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు అభివృద్ధి పనులకు చంద్రబాబు టెంకాయ కొట్టడం నమ్మకద్రోహం అయినప్పుడు.. ఇప్పుడు మీరు చేస్తున్నదేమిటి? దీనిని నమ్మకద్రోహం అనరా..? ఇదేనా మీరు పదేపదే చెబుతున్న విశ్వసనీయత..? దీనిని చిత్తశుద్ధి అంటారా..? అంటూ జగన్‌పై సెటైర్లు వేస్తున్నారు జిల్లా ప్రజలు.

నిధులు మంజూరయ్యాయా?

నేషనల్ లా యూనివర్సిటీ క్యాంపస్ 150 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామని ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సమకూర్చాల్సి ఉంది. అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందా..? పరిపాలన అనుమతులు వచ్చాయా..? అంటే అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. ఎంత నిధులు మంజూరు చేశారో కూడా చెప్పడం లేదు. అయితే రూ.600 కోట్లతో ఎన్‌ఎల్‌యూ నిర్మిస్తామని గతేడాది నవంబరులో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన పేర్కొన్నారు. వాస్తవంగా ఎంత నిధులు మంజూరు చేశారో ఇప్పటికీ స్పష్టత లేదు.

ఉర్దూ యూనివర్సిటీని అటకెక్కించారు!

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం చంద్రబాబు కర్నూలు కేంద్రంగా 2016లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం స్థాపించారు. ఓర్వకల్లు సమీపంలో కర్నూలు విమానాశ్రయం పక్కనే 120 ఎకరాల్లో శాశ్వత భవనాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పలు భవనాలు పైకప్పు కూడా వేశారు. అయితే 2019 మే నెలలో సీఎం జగన్ ప్రభుత్వం రాగానే ఉర్దూ విశ్వవిద్యాలయానికి గ్రహణం పట్టింది. ఐదేళ్లుగా ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. టీడీపీ ప్రభుత్వంలో కట్టిన భవనాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. అదే క్రమంలో రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టిన స్టేట్ క్యాన్సర్ యూనిట్ ఈ ఐదేళ్లలో కేవలం భవనం చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన భవనాలు మాత్రమే పూర్తి చేశారు. కీలకమైన యంత్ర పరికరాలు తీసుకురాలేదు. ఐదేళ్లలో ఉర్దూ యూనివర్సిటీ భవనాలు ఒక్క ఇటుక పెట్టని జగన్ ప్రభుత్వం..



సీఎం రాక సందర్భంగా జగన్నాథగట్టుపై ఏర్పాట్లు

ఎన్నికలకు ముందు నేషనల్ లా యూనివర్సిటీ పనులకు శంకుస్థాపన కోసం హడావుడి చేయడం విమర్శలకు తావిస్తుంది. ఐదేళ్ల పట్టించుకోని ప్రభుత్వానికి ఎన్నికల ముందే గుర్తుకొచ్చిందా..? అని ప్రశ్నిస్తున్నారు.



తళుక్కుమన్న సంయుక్త

వరుస హిట్‌లతో కుర్రకారు మతిపోగొడుతున్న హీరోయిన్ సంయుక్త మీనన్ కర్నూలు నగరంలో సందడి చేసింది. నగరంలోని జీవీ మాల్ షోరూమ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. 'సార్' సినిమా ఫేమ్ సంయుక్తను చూసేందుకు యువకులు భారీగా తరలివచ్చారు. -7లో

బోగస్ ఓట్లపై చర్యలు తీసుకోవాలి

నగర పాలక సంస్థ కమిషనర్‌కు కలెక్టర్ లేఖ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: కర్నూలు నియోజకవర్గ పరిధిలో ఉన్న బోగస్ ఓట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. జి. సృజన నగర పాలక సంస్థ కమిషనర్, కర్నూలు అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఏ. భార్గవతేజకు లేఖ రాశారు. 2024 జనవరిలో ప్రచురించిన నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఇంకా డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు టీడీపీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జి టీజీ భరత్ లేఖ రాసినట్లు ఆమె పేర్కొన్నారు. బోగస్ ఓట్లపై విచారణ చేపట్టి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె లేఖలో పేర్కొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 13: సంస్కృత రామాయణాన్ని తెలుగీకరించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొల్ల రామాయణానికి ముందు రంగనాథ రామాయణం తప్ప ఇంకొకటి లేదన్నారు. వ్యవహారిక భాషలో అందరికీ అర్థమయ్యేలా రామాయణం రాయడం మొల్ల గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జీడీ కల్పన, డీఆర్వో మధుసూదన్‌రావు, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1020 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 13: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బుధవారం జరిగిన పరీక్షకు 1020 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 21,726 మంది ఉన్నారు. ఇందులో 20,706 మంది పరీక్షకు హాజరు కాగా, 1020 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆర్‌ఐవో తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్‌పాషా, డీఈసీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ నిర్వహించారు.

నాన్నా ఎందుకిలా చేశావు?



తండ్రి శాంతికుమార్

ఇతను తండ్రి అనే మాటకు కళంకం తెచ్చాడు. మాటలు కూడా నేర్వని చిన్నారిని గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. 18 నెలల పసిపాప తండ్రి దగ్గరికి ఎప్పటిలాగే నవ్వుతూ, తుళ్లుతూ వెళ్లి ఉంటుంది. కానీ ఆ తండ్రికి తన కూతురు పుట్టుక మీదే అనుమానం. దాంతో అతడు క్రూరంగా తయారయ్యాడు. బుడిబుడి అడుగుల పాపను గొంతుకోసి హత్య చేశారు. ఆ పాపకే తిరిగి ప్రాణం వస్తే...తండ్రితో ఇలా అంటుందేమో..

ఎందుకు నాన్నా నన్ను చంపావు?
నేనేం పాపం చేశాను?
నీకు కూతురుగా పుట్టడమే
నేను చేసిన తప్పా?
నన్ను చంపడానికే కన్నావా?
నిద్రలేపి నన్ను తీసుకెళ్తుంటే
సరదాగా ఆడుకుంటావని ఆశపడ్డా
ఇలా నా గొంతు కోస్తావనుకోలేదు..
అమ్మపై అనుమానమా నాన్నా
అమ్మ అలాంటిది కాదు నాన్నా
మనం ముచ్చటగా ఉంటామనుకున్నా...
ఎందుకు నాన్నా ఇలా చేశావు..
రోజూ నువు ఇంటికి రాగానే
నీ చేతుల్లో వాలిపోయే దాన్ని కదా..
నీవు నన్ను ఎత్తుకుంటే
నీ మెడ చుట్టూ చేతులు వేసి
మురిసిపోయేదాన్ని కదా నాన్నా..
మరి నా గొంతు కోయడానికి
నీకు చేతులు ఎలా వచ్చాయి నాన్నా
నీకెన్ని అనుమానాలు ఉన్నా
నేను నీ బిడ్డనే నాన్నా..



వర్షిణి (ఫైల్)

భార్యపై అనుమానంతో..

బిడ్డను చంపిన తండ్రి



- జంపాపురంలో దారుణం

కోసిగి, మార్చి 13: భార్యపై అనుమానంతో 18 నెలల కన్నబిడ్డను చంపేశాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా కోసిగి మండలం జంపాపురం గ్రామంలో జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఖగల్లు శాంతి కుమార్, ఆశీర్వాదమ్మలకు మూడేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి వర్షిణి అనే 18 నెలల పాప ఉంది. శాంతకుమార్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఆశీర్వాదమ్మ కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి పాప పుట్టిందని భార్యా బిడ్డల మీద ద్వేషం పెంచుకున్నాడు. దీంతో మంగళవారం రాత్రి చిన్నారిని పశువుల పాకలోకి తీసికెళ్లి కత్తితో గొంతుకోసి హత్య చేశాడు. ఇంట్లో కూతురు కనిపించకపోయే సరికి ఆశీర్వాదమ్మ అంతటా వెతికింది. పశువుల పాకలో రక్తపుమడుగులో చిన్నారిని చూసి బోరున విలపించింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు దిగ్భ్రాంతి చెందారు. అయితే గ్రామస్థులు శాంతికుమార్‌ను ఓ గదిలో బంధించారు. బుధవారం ఉదయం ఈ విషయం తెలిసి సీఐ ప్రసాద్, ఏఎస్‌ఐ నాగరాజు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. కూతురును హత్య చేసిన శాంతి కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. భార్యపై అనుమానంతోనే తన కూతురుని హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని ఆయన తెలిపారు.



వర్షిణి ఇంటి ముందు గుమికూడిన ప్రజలు




రోదిస్తున్న తల్లి ఆశీర్వాదమ్మ

వైసీపీలో ముసలం

పదిమంది కార్పొరేటర్లు రాజీనామాకు సిద్ధం?

పార్టీలో చిచ్చురేపిన 'మేయర్' మార్పు ప్రకటన

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీలో ముసలం నెలకొంది. పది మంది కార్పొరేటర్లు రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. 25వ వార్డు కార్పొరేటర్ సత్య నారాయణమ్మకు మేయర్‌గా కల్పిస్తున్నట్లు అధిష్ఠానం ఆదేశాలు జారీ చేయడం ఆ పార్టీలో చిచ్చుకు కారణమైంది. ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకున్న సీనియర్లను పక్కనబెట్టి కార్పొరేటర్‌గా బి-ఫారం తీసుకున్నప్పుడు పార్టీ కండువా వేసుకుని వచ్చిన వారికి మేయర్ పదవి ఎలా ఇస్తారని కొందరు కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు కార్పొరేటర్లు సోషల్‌మీడియాలో తమ అక్కసును వెళ్లగక్కుతున్నారు. కలెక్టర్‌కు రాజీనామా లేఖలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. అయితే సీఎం జగన్ పర్యటన సందర్భంగా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే నేరుగా తమ రాజీనామాలను సమర్పించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు సీటు కేటాయించకపోవడంతో పార్టీ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డికి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. అది మరువక ముందే మరోసారి వైసీపీలో దుమారం రేగింది. రాజీనామాలు చేసిన వైసీపీ కార్పొరేటర్లను బుజ్జగించేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ వర్గానికి చెందిన ముగుర్గు కార్పొరేటర్లు ఆగ్రహంగా ఉన్నారు.




కిడ్నీలను కాపాడుకోండి

- చివరి దశలో చికిత్స కష్టం
- మూత్రపిండాలు పని చేయకపోతే ప్రాణాలకే ముప్పు
- నేడు వరల్డ్ కిడ్నీ డే

కర్నూలు(హాస్పిటల్), మార్చి 13:

మూత్రపిండాలు శరీరం నుంచి వ్యర్థపదార్థాలను తొలగించి శరీరంలో ద్రవ పదార్థాల సమతుల్యతను కాపాడుతాయి. రక్తపీడనాన్ని క్రమబద్ధీకరించి, గట్టి ఎముకల తయారీకి ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి సహకరిస్తాయి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి తదితర సమస్యలతో ఉమ్మడి జిల్లాలో కిడ్నీ సంబంధిత రోగాలు పెరుగుతున్నాయి. రోగులు కిడ్నీ దెబ్బతిన్న తర్వాత దశలో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో కిడ్నీ మార్పిడి అనివార్యమవుతున్నది. ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం కిడ్నీ జబ్బులపై అవగాహన పెంచేందుకు డబ్ల్యూహెచ్‌వో ఈ ఏడాది వరల్డ్ కిడ్నీ డే నిర్వహిస్తోంది. ఈ ఏడాది డబ్ల్యూహెచ్‌వో కిడ్నీ ఆరోగ్యం అందరికీ అనే నినాదం ఇచ్చింది.




కిడ్నీలు దెబ్బతింటే శరీరమంతా ప్రభావితమవుతుంది. ఒంట్లో వ్యర్థాలు పోగుపడి చెత్త కుప్పలా తయారవుతుంది. తొలిదశలో ఏమీ లక్షణాలు కనిపించవు. నెమ్మదిగా కిడ్నీల సామర్థ్యం మందగించి, చివరికి కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారి తీస్తుంది. జబ్బు ముదరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

కర్నూలు సర్వజన వైద్యశాలలో కిడ్నీ మార్పిడీ ఆపరేషన్లు

కర్నూలు సర్వజన వైద్యశాలలో 2019 ఆగస్టు 19న రాయలసీమలోనే తొలిసారిగా ఓ రోగికి కిడ్నీ మార్పిడీ ఆపరేషన్ చేశారు. మళ్లీ 2024 ఫిబ్రవరి 16న కర్నూలు జీజీహెచ్‌లో ఇద్దరు రోగులకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారు. యురాలజీ విభాగపు హెచ్‌వోడీ డా.సీతారామయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డా.ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రాజారెడ్డి, నెఫ్రాలజీ హెచ్‌వోడీ డా .అనంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఫక్కిరెడ్డి కిడ్నీ మార్పిడీ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

నెలకు 700 మంది రోగులు



కర్నూలు జీజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగానికి నెలకు 700 మంది రోగులు వస్తుంటారు. వారంలో ప్రతి బుధవారం, శనివారం ఓపీ ఉంటుంది. ప్రతి నెలా 150 మంది అడ్మిషన్ పొందుతుంటారు. దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలు ఉన్నవారు డయాలసిస్ చేయించుకునేవారు వస్తుంటారు. వీరికి డయాలసిస్ చేసేందుకు ఏవీ ఫిస్టులా సెంట్రల్ లైన్, పర్మినెంట్ క్యాథ్ వంటి చికిత్సలు అందిస్తున్నారు.

ప్రాథమిక దశలోనే గుర్తించాలి



మధుమేహం, రక్తపోటు ఉన్న వారు వాటిని అదుపులో ఉంచుకుంటే కిడ్నీ జబ్బులు రావు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు సీరమ్ క్రియాటిన్, యూరిన్ అల్బ్యూమిన్ చేయించుకోవాలి. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా కిడ్నీ కేసులు అధికమవుతున్నాయి. యూరిన్ తగ్గిపోవడం, చర్మం పాలిపోవడం, కాళ్లనొప్పులు ఉంటే జాగ్రత్త పడాలి.

- డా.సిద్ధార్థ్ హెరూర్, నెఫ్రాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

ఈ లక్షణాలుంటే..

- మధుమేహం, బీపీతో బాధపడేవారు..
- రాత్రి నిద్రలో లేచి మూత్రానికి వెళ్లేవారు..
- ఒళ్లు వాపులు ఉన్నవారు, కాళ్ల వాపులు ఉన్నవారు..
- మూత్రవిసర్జనలో మార్పులు, మూత్రం తక్కువగా రావడం..
- చర్మం పొడి, దురద ఉంటే.. తప్పక వైద్యులను సంప్రదించాలి. కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

నేడు కిడ్నీ వ్యాధిపై అవగాహన ర్యాలీ



అంతర్జాతీయ కిడ్నీ వ్యాధుల నివారణ దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన కర్నూలు ప్రభుత్వాసుపత్రి నుంచి రాజ్‌విహార్ సెంటరు వరకు తిరిగి హాస్పిటల్ వరకు కిడ్నీ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్, నెఫ్రాలజీ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొంటారు.

- డా.ఎస్.అనంత్, నెఫ్రాలజీ విభాగాధిపతి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి

కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి ప్రతి రోజు నాలుగు నుంచి 5 లీటర్లు నీటిని తాగాలి. వ్యాయామం చేయాలి. పెయిన్ కిల్లర్ యాంటి బయాటిక్స్‌కు దూరంగా ఉండాలి. ముఖ్యంగా మధుమేహం, బీపీ ఉన్న వారు తరచూ పరీక్షలు చేయించుకోవాలి.

- డా.ఫక్కిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్

కొనసాగుతున్న గురు వైభవోత్సవాలు

- రాఘవరాయలకు విశేష పంచామృతాభిషేకం
- అలరించిన భారతనాట్యం..



సంస్థాన పూజ చేస్తున్న మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, మార్చి 13: మంత్రాలయంలో శ్రీగురు రాఘవేంద్రస్వామి గురువైభోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు కవచం, వెండి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి హారతులు ఇచ్చారు. అంతకుముందు పూర్ణబోధ పూజామందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు సంస్థాన పూజ చేసి హారతులు ఇచ్చారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి చెక్క, వెండి, రజిత గజవాహనం, బంగారు, నవరత్నాల రథాలపై వైభవంగా ఊరేగించారు. గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి యోగీంద్ర కల్యాణ మండపంలో బెంగుళూరుకు చెందిన కల్చరల్ చారిటబుల్ ట్రస్టు శివలీలచే నిర్వహించిన భరతనాట్యం భక్తులను కనువిందు చేసింది. అదే బెంగుళూరు చెందిన విద్వాన్ సోషలేసమీరాచార్‌చే దాసవాణి సాహిత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజాఎస్‌గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్‌జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, వాధిరాజాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ భద్రినాథ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, విజయేంద్రాచార్, రవికులకర్ణి, డీఎం ఆనందరావు, ద్వారపాలక అనంతస్వామి, వామేంద్రచార్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు అవార్డుల ప్రదానం



ప్రమోద్ కుమార్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

గురువైభోత్సవాల్లో మూడో రోజు బుధవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో ప్రముఖులకు పీఠాధిపతి అవార్డులు ఇచ్చారు. హైదరాబాదు యశోద ఆసుపత్రి ప్రముఖ గుండె వైద్యనిపుణులు ప్రమోద్ కుమార్, కర్ణాటకలోని విజయనగర జిల్లా ఎస్పీ బీఎల్ శ్రీహరిబాబు, బెంగుళూరు చెందిన స్కాలర్ వీణా భన్నంజే, అనంతపురం దాస సాహిత్య ప్రాజెక్టు నిర్వాహకురాలు యశోదమ్మ, సామాజికవేత్త జయతీర్థులకు అవార్డులు అందజేశారు.

ధార్మిక సేవలు స్ఫూర్తిదాయకం

త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ



గోదా గోకులానికి వస్తున్న చిన్న జీయర్ స్వామీజీ

కర్నూలు(కల్చరల్), మార్చి 13: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన గోదాదేవి సమేత శ్రీరంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకులం)లో నిర్వహిస్తున్న ధార్మిక సేవలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని శ్రీ త్రిదండి రామనుజ చిన్న జీయర్ స్వామీజీ అన్నారు. గోకులంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజు బుధవారం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామీజీకి గోకులంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు బృందం పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు కార్యక్రమంగా ఉదయం ధ్వజారోహనం, శేషవాహనం, తిరుమంజనం, సాయంత్రం కల్పవృక్ష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గోకులంలోని తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేశ్ బట్టర్, కిరణ్ బట్టర్ బృందం ఈ క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్ధన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యం, టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఈవో డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, సాయి సేవకుడు మహాబలేష్ తదితరులు పాల్గొన్నారు.

విష ద్రావణం తాగి వివాహిత మృతి

తల్లి పాలు తాగి పసికందు మృతి



ఇందుమతి (ఫైల్)

శిరివెళ్ల, మార్చి 13: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో ఇందుమతి (29) అనే వివాహిత విష ద్రావణం తాగి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే యర్రగుంట్లకు చెందిన వెంకటసుబ్బమ్మ, వెంకటసుబ్బారెడ్డిల కుమార్తె ఇందుమతిని చాగలమర్రి మండలం తోడెండ్లపల్లెకు చెందిన సతీష్‌రెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. కొన్ని నెలల కిందట ప్రసవం కోసం ఇందుమతి స్వగ్రామమైన యర్రగుంట్లకు వచ్చింది. గత ఏడాది తల్లి వెంకటసుబ్బమ్మ మృతి చెందడంతో ఆమె మరణాన్ని జీర్ణించుకోలేక ఇందుమతి మానసికంగా బాధపడుతుండేదని అన్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి విష ద్రావణం తాగింది. అనంతరం మూడు నెలల పసికందుకు తల్లిపాలు ఇవ్వడంతో విష ద్రావణం ప్రభావం వల్ల ముక్కుపచ్చలారని చిన్నారి మృత్యువాత పడింది. ఇందుమతి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిందని అన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ వెల్లడించారు.

షెడ్యూల్ రాక ముందే పనులు ప్రారంభించాలి

ఇంజనీరింగ్ అధికారులకు జడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశాలు



మాట్లాడుతున్న సీఈఓ జి.నాసరరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: ఎన్నికల షెడ్యూల్ రాకముందే గ్రామాలు, పట్టణాల్లో పనులు ప్రారంభించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ మినీ సమావేశం భవనంలో జరిగిన ఏడు స్థాయి సంఘ సమావేశాలకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయబ్ అధ్యక్షత వహించగా సీఈఓ జి. నాసరరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని, యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పనులు ప్రారంభించడానికి అగ్రిమెంటు కావాలని, మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. షెడ్యూల్ వచ్చిందంటే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్టేనని ఆయన అన్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీలు దివ్య, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, ఉరుకుందమ్మ, పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరంభమైన జీవీ మాల్ షోరూమ్

షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటి సంయుక్త మీనన్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ సంయుక్తమీనన్



షోరూమ్ వివరాలను వెల్లడిస్తున్న ఎండీ జి.ఉమామహేశ్వర రావు

కర్నూలు(కల్చరల్), మార్చి 13: నగరంలోని పార్కురోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన జీవీ మాల్ (షాప్ అండ్ సెలబ్రేట్) షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవీ మాల్ షోరూమ్ ప్రారంభోత్సవానికి సినీ నటి సంయుక్త మీనన్ హాజరయ్యారు. సంస్థ ఎండీ జి.ఉమామహేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకలతో కలిసి ఆమె షోరూమ్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ జీవీ మాల్ షోరూమ్ సంస్థ తన 15వ షోరూమ్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. అన్ని వర్గాల మహిళలు కోరుకునే విభిన్న రకాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటివి ఇక్కడ లభిస్తాయని చెప్పారు. తాను కర్నూలుకు రావడం తొలిసారి అని, ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలు చాలా బాగున్నాయని ప్రశంసించారు. సంస్థ ఎండీ జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీవీ మాల్ షోరూమ్‌ను కర్నూలులో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది తమ 15వ షోరూమ్ అన్నారు. వినియోగదారులకు అందుబాటు ధరల్లో వస్త్ర ఉత్పత్తులను మాల్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. వినియోగదారులకు ఉత్తమసేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతామని, అదే తమ షోరూమ్ ప్రత్యేకత అని చెప్పారు. సినీనటి సంయుక్త మీనన్‌ను చూసేందుకు వందలాదిగా ప్రజలు షోరూమ్ వెలుపల వేచి చూశారు. ఆమె షోరూమ్ చేరుకునేవరకు కేరింతలు వేశారు.

పరదాల చాటున తిరిగే సీఎం అవసరమా..?

నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి



గౌరు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

గడివేముల, మార్చి 13: పరదాల చాటున తిరిగే సీఎంకు మనకు అవసరమా? అని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన గడివేముల మండలంలోని గడిగరేవుల గ్రామంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని అన్నారు. రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కు వెళ్లిందని అన్నారు. బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని గొప్పలు చెబుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో మహిళలు, యువకులు, రైతులు ఎటువంటి ఆర్థిక పురోగతి సాధించలేదని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వైసీపీ నాయకులు ఇళ్ల పట్టాలు అంటూ హడావుడి చేస్తున్నారే తప్పా ఇప్పటి వరకు ఎక్కడా జగనన్న కాలనీలు పూర్తి కాలేదని విమర్శించారు. పాణ్యం నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలు, అక్రమ కేసుల బనాయింపు పెరిగి పోతున్నాయని అన్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వైసీపీ పాలనపై విరక్తి చెందిన ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని అన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు పెరిగాయని అన్నారు. యువకుల్లో మార్పు మొదలైందని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు.

● వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

వైసీపీ ప్రభుత్వంపై విరక్తి చెంది ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి చేరారు. మండలంలోని గడిగరేవుల గ్రామ సర్పంచ్ సోదరుడు రాంభూపాల్‌రెడ్డి, వార్డు మెంబర్ ప్రసాదులతో పాటు 50 కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి సమక్ష్యంలో టీడీపీలో చేరారు. వారికి గౌరు వెంకట రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పాణ్యం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల జాబితా పరిశీలన

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 13: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గతంలో నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్, ఇన్‌స్ట్రక్టర్స్‌గా పని చేసిన అభ్యర్థులు సమర్పించిన ధృవపత్రాల ఆధారంగా జాబితాను తయారు చేసి ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు పంపినట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ విజయజ్యోతి కుమారి బుధవారం తెలిపారు. ఎన్ఎఫ్ఈ సెంటర్లు నడిచిన స్థలాల్లోని సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు ఆ జాబితాను రికార్డుల ఆధారంగా పరిశీలించి జాబితాలో ఏమైనా తప్పులుంటే సరి చేసి సంబంధిత విద్యార్హతలు, ఇతర పత్రాల నకలు కాపీలను ధృవీకరించి ఈ నెల 18వ తేదీలోగా జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపాలని కోరారు.

జర్నలిస్టులకు స్థలాలు త్వరగా గుర్తించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 13: జర్నలిస్టు హౌసింగ్ స్కీంకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం అందజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి. సృజన జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. బుధవారం అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థలాన్ని ఎక్కడ గుర్తించారా.. దాని బేసిక్ వ్యాల్యూ సిద్ధం చేశారా..? స్థలాలు ఎంత మందికి ఇవ్వాలి..? అని డివిజనల్ అధికారులను ప్రశ్నించారు. డివిజన్‌లో ఎంత మంది డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో స్థలాలు కోరారు? మండలాల్లో స్థలాలను కోరారు? అనే వివరాలను సమర్పించాలని కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు. పత్తికొండ డివిజన్‌లో 49 మంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, ఆదోని డివిజన్‌లో 70 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. వారు కోరిన మండలాల్లో స్థలాలను గుర్తించి బేసిక్ ప్రైస్ వివరాలతో నివేదికలు బుధవారంలోపు సమర్పిస్తామని డివిజనల్ అధికారులకు తెలియజేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్సవమూర్తులు కాల్వకు తిరుగు ప్రయాణం



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కాల్వకు తీసుకెళ్తున్న భక్తులు

ఓర్వకల్లు, మార్చి 13: రామేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాల్వబుగ్గ నుంచి స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లకు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. బుధవారం స్వామి అమ్మవార్ల ఉత్సవమూ ర్తులను పల్లకిలో ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె నరసింహాశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందికోల సేవలు, మేళతాళాల మధ్య స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు కాల్వ బుగ్గ ఆలయం నుంచి కాల్వ గ్రామానికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, కమిటీ సభ్యులు రామక్రిష్ణ, నాగరాజు, మహేశ్వరప్ప, ఆకుల రాజేష్, జి. లక్ష్మీదేవి, ఎం.మద్దమ్మ, బాలమ్మ, సి. లక్ష్మీదేవి, సేనావత్ కళ్యాణిబాయి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆర్‌యూలో బీసీడీఈ సదస్సు

కర్నూలు(అర్బన్), మార్చి 13: ఉన్నత విద్యలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (బీసీడీఈ) కార్యక్రమం ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ నాగుల అంకన్న తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించే అవగాహన సదస్సుతో పాటు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, వర్సిటీకి అనుబంధంగా ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్, బీసీడీఈ కాలేజీ కోఆర్డినేటర్లు, విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి బీ. సుధీర్ ప్రేమ్ కుమార్, ఉన్నత విద్యామండలి బీసీడీఈ కార్యదర్శి, ముఖ్యకార్య నిర్వహణాధికారి ఎంఎల్ఎస్ దేవకుమార్, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 13: పెండింగ్‌లో ఉన్న ఓటర్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు దరఖాస్తులు ఏ ఒక్కటి కూడా పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. ఎపిక్ కార్డులు వచ్చిన వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జి. సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

కర్నూలు(అర్బన్), మార్చి 13: దళితుల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని దళిత జేఏసీ చైర్మన్ బోల్లెద్దుల రామక్రిష్ణ అన్నారు. బుధవారం నగరంలోని 42వ వార్డులోని శివయ్యనగర్, తిలక్ నగర్‌లలో టీడీపీ దళిత జేఏసీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా బోల్లెద్దుల రామక్రిష్ణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరిగిందని, ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ దళిత జేఏసీ నాయకులు, వార్డు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సుంకేసులలో బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

కర్నూలు(రూరల్), మార్చి 13: కర్నూలు రూరల్ మండలం సుంకేసుల గ్రామంలో బుధవారం సాయంత్రం కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి బాబుషూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను దస్తగిరి ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును సీఎంను చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కురువ గిడ్డమ్మ, గ్రామ నాయకులు శ్రీరాములు, రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ ప్రసాద్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, రవి, గంగాధర్, వడ్డె కృష్ణ, నాగన్న, మాజీ సర్పంచ్ రామచం ద్రుడు, ఆదాము పాల్గొన్నారు.

దివ్యాంగ మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కర్నూలు(కల్చరల్), మార్చి 13: అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, గ్రేటర్ కర్నూలు క్లబ్, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో, వృత్తి విద్యల శిక్షణలో భాగంగా దివ్యాంగ మహిళలకు సర్టిఫికెట్ కోర్సు ఇన్ కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్ అంతర్జాతీయ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు శిక్షణ రెండు నెలల కాలపరిమితి ఉంటుందని, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఆధార్, పాస్ పోర్టు సైజు ఫొటో, దివ్యాంగ గుర్తింపు సర్టిఫికెట్లతో కర్నూలు వెంకటరమణ కాలనీ మొదటి లైన్‌లోగల నైస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో ఈనెల 20లోగా సంప్రదించాలని సూచించారు. ఈనెల 30 నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణలు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు సెల్: 9396861308 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మేయర్ మార్పు ప్రకటనపై హర్షం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 13: కర్నూలు 25వ వార్డు కార్పొరేటర్ చిత్రా సత్యనారాయణమ్మను మేయర్‌గా నియమిస్తూ వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకోవడంపై కర్నూలు జిల్లా కురువ సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం మేయర్ సత్యనారాయణమ్మను జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా కోశాధికారి కేసీ నాగన్న, జిల్లా మహిళ కురువ సంఘం అధ్యక్షురాలు టి.లీలమ్మ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

గీతాంజలి మరణాన్ని రాజకీయం చేయొద్దు

ఓర్వకల్లు, మార్చి 13: గీతాంజలి మరణాన్ని రాజకీయం చేయొద్దని ఐహెచ్‌ఆర్‌సీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హనీసాపాషా అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే మహిళలు ధైర్యంగా బయటకు వచ్చి విద్య, ఉద్యోగ, వ్యాపార రాజకీయ రంగాల్లో రాణించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సోషల్ మీడియా సమాజంలో జరుగుతున్న చెడు, అన్యాయం, అభివృద్ధి గురించి ఉపయోగించాలన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శకుంతల

సి.బెళగల్, మార్చి 13: పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో శకుంతల కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. పంచా యతీ అనుమతి లేకుండా వేసే అక్రమ లే అవుట్లు, తాగునీటి కొళాయి కనెక్షను ఇవ్వరాదన్నారు. గ్రామాల్లో తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసమా వేశంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మార్చి 13: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు సోమిశెట్టి నగర్ కొట్టాలు, ఐశ్వర్య ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఆమె ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజక వరగ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగముని, వార్డు నాయకులు వంగాల జనార్దన్‌రెడ్డి, సాయి, విజయ్ యాదవ్, సుబ్బు, ఆనంద్ ప్రేమ్‌కుమార్, రాజు, మాండ్ర నరేంద్రరెడ్డి, సీమ ప్రసాద్‌రెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, కే శ్రీనివాసరావు, టీచర్ జగదీష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత

డంప్‌యార్డును తలపిస్తున్న పార్కు

పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: వీకర్ సెక్షన్ కాలనీలో ఉన్న పుచ్చల పల్లి సుందరయ్య పార్కును డంప్‌యార్డుగా మార్చారని పట్టణ పౌరసం క్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. బుధవారం కమిటీ బృందం పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.10కోట్ల విలువైన పార్కు స్థలాన్ని ఓ కాంట్రాక్టర్ తన కబ్జాలో ఉంచుకుని, అందులో మట్టి, కంకర, ఇసుక నిల్వ చేస్తున్నారని అన్నారు. రోడ్లపై రోడ్లు వేస్తూ అనవసరంగా నిధులు ఖర్చు చేస్తున్న అధికారులకు ఈ పార్కును అభివృద్ధి చేయాలనే ఆలోచన ఎందు కు రాలేదని ఆయన ప్రశ్నించారు. అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే కమిషనర్ పార్కును స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేఎస్.పద్మ, పి.చంద్రయ్య, టి.నరసింహ, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, ఎం.రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పార్కులో వేసిన కంకరను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

ఎన్నికల విధులకు సిబ్బందిని నియమించండి

కలెక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 13: ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బంది నియమించాలని పోలింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులను కలెక్టర్ డా.జి. సృజన ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌పై సంబంధిత నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు విధులు నిర్వహించేందుకు జిల్లాలో ఎంత మంది సిబ్బంది ఉన్నారని అడిగారు. పాణ్యం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఎవరూ సమకూ ర్చాలనే దానిపై కూడా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకోవాలన్నారు. కాంట్రాక్టు, అంగన్‌వాడీ సిబ్బంది వివరాలు సేకరించి ఉన్నప్పటికీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివ రాలను సేకరించాలన్నారు. ఈ సమావేశంలో ఖజానా శాఖ డీడీ రామచం ద్రరావు, ఉపాధి కల్పన అధికారి దీప్తి, ఎన్ఐసీ అధికారి ప్రవీణ్ కుమార్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి : జేసీ



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 13: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించామని, అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీ ప్రతిని దులకు తెలియజేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీని కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటర్లకు అను కూలంగా ఉండే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈసమావేశంలో పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, బీఎస్‌పీ పార్టీ ప్రతినిధి చిరంజీవి, టీడీపీ ప్రతినిధి ఆర్.యశ్వంత్ రెడ్డి, బీజేపీ, సీపీఎం పార్టీల ప్రతినిధులు, కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీఎల్‌ఓ, సెక్టోరల్ అధికారులకు శిక్షణ



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓ, సెక్టోరల్ అధికారులకు ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. బుధవారం ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో కర్నూలు అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి భార్గవతేజ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్, పోల్‌డే కార్యకలాపాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, సూపరింటెండెంట్ సుబ్బన్న, అనంత్‌నాగ్ పాల్గొన్నారు.

పనిచేయని బోర్లు

సి.బెళగల్, మార్చి 13: బోర్లు అక్కరకురాకుండాపోయాయి. కనీస మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని శాశ్వతంగా పనిచేయడం లేదు. ఏ గ్రామానికి వెళ్లినా పనిచేయని బోర్లు కనిపిస్తున్నాయి. సి.బెళగల్ మండలంలోని 18 గ్రామ పంచాయతీలు మూడు మజరా గ్రామాలు కలుపుకుని మొత్తం మండలంలో 21 గ్రామాలు అయితే ఆయా గ్రామాలలో మొత్తం బోర్లు 138 ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం పనిచేస్తున్న బోర్లు 133 అని అధికారులు రికార్డులలో నమోదైంది. అయితే ప్రస్తుతం పంచాయతీలలో పని చేస్తున్న బోర్లు 50 మాత్రమే. బోర్లు మరమ్మతులకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదు. దీంతో కొన్ని బోర్లు దీర్ఘకాలికంగా మరమ్మతులకు నోచుకోలేదు. నిధుల కొరత, అధికారుల పర్యవేక్షణ లోపం దీనికి కారణం. మేజరు గ్రామ పంచాయతీలైన సిబెళగల్, పోలకల్లు లో ఎక్కడ చూసినా పని చేయని బోర్లు కనిపిస్తున్నాయి సి.బెళగల్ మండలంలో 5 సంవత్సరాల నుంచి కొత్తగా బోర్లు వేయలేదు. మండలంలో 57123 జనాభా ఉన్నా తాగునీటి పథకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్యాతోలి, క్రిష్ణదొడ్డి, గొల్లలదొడ్డి, కంబంధహాళ్ బ్రాహ్మణదొడ్డి, తిమ్మనదొడ్డి, చింత మానుపల్లె, సంగాల, గుండ్రేవుల, ముడుమాల, కొండాపురం, పల్లెదొడ్డి, పోలకల్లు, సిబెళగల్ ఇనగండ్ల గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది చేతిపంపులు ఏర్పాటు చేస్తే ఏంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

» అవస్థల్లో ప్రజలు » కొరవడిన అధికారుల పర్యవేక్షణ



గుండ్రేవులలో పనిచేయని బోరు

నిధులు విడుదలయ్యాయి

మండలంలోని వివిధ గ్రామాలలో వాడకం సరిగా లేనందున బోర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి మరమ్మతులకు మండల నిధులు విడుదలయ్యాయి. అవసరమైన కొంత సామగ్రిని కొనుగోలు చేసి ప్రాధాన్యత ఉన్న బోర్లకు మర్మతులు చేస్తామన్నారు.

- గోసెనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

టీడీపీలోకి మల్లాపురం వైసీపీ నాయకులు



విష్ణు సమక్షంలో టీడీపీలో చేరిన మల్లాపురం వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 13: గూడురు మండలం మల్లాపురం గ్రామానికి చెందిన 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి బుధవారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికి విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ నిచ్చారు. టీడీపీలో చేరిన వారిలో నీటిసంఘం మాజీ డైరెక్టర్ నాగార్జునరెడ్డి, సుల్తాన్, రాంభూపాల్‌రెడ్డి, బోయ పెద్దపాడు, పెద్దదస్తగిరి, ఉప్పరి హనుమంతు, మాలకృష్ణ, పెద్దకా శీమన్న, మదర్ సాహెబ్, బోయ చిన్నదస్తగిరి, కురువ మల్లకల్, ఎస్ఎం బాషా, వార్డు సభ్యులు ఉన్నారు. ఈకార్యక్రమంలో గూడురు మండల టీడీపీ నాయ కులు మహేశ్వరరెడ్డి, రామాంజనేయులు, జె.సురేష్, పౌలు, విజయ్, రేమట వెంకటేష్, సృజన్ కాశీ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రామక్రిష్ణ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 13: పెండింగ్‌లో ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మొటిక్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి యువజన సంఘం జాతీయ కార్యదర్శి కె.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. బుధవారం బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ బీసీ హాస్టల్ విద్యార్థులకు నేడు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. బీసీ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పది పరీక్షల విధుల కేటాయింపులో గోల్‌మాల్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 13: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేటర్ డ్యూటీల కేటాయింపులో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నట్లు బీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.సతీష్ కుమార్ బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉప విద్యాశాఖధికారి కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు కొందరు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి డబ్బు లు తీసుకుని నంద్యాల, కర్నూలు పట్టణాల్లో పదో తరగతి పరీక్షల డ్యూటీలను వేయించుకుంటున్నట్లు ఆయన ఆరోపించారు. అయితే ఈవిషయం జిల్లా విద్యా శాఖ అధికారులకు తెలియకుండా జాగ్రత్తలు పడుతున్నారన్నారు. గత కొన్నే ళ్లుగా కొలిమిగుండ్ల, ఆత్మకూరు, శ్రీశైలం, చాగలమర్రి, బనగానపల్లె, గడివేముల , హోళగుంద, చిప్పగిరి, కోసిగి, కౌతాళం, హాలహర్వి, ఆదోని మండలాల్లో పని చేసే ఉపాధ్యాయయులు జిల్లా కేంద్రంలో ఉండే పది పరీక్ష కేంద్రాల్లో ఇన్విజి లేటర్లుగా డ్యూటీలు వేయించుకోవడం పరిపాటిగా మారిందన్నారు. గతంలో ఎన్నో ఫిర్యాదులు చేసినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేద న్నారు. పదో తరగతి పరీక్షల డ్యూటీలు నియమ నిబంధనలకు లోబడి 8 కి.మీల పరిధిలో ఉన్న పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను మాత్రమే ఇన్విజి లేటర్ల డ్యూటీలను వేయాలని ఆయన కోరారు.

సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించిన మోదీ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: దేశంలోని షెడ్యూలు కులాలు, వెనుక బడిన తరగతులు, పారిశుధ్య కార్మికుల అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూరజ్ పోర్టల్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ బీవై.రామయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఎల్‌డీఎం రామచంద్రరావు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ గీతామాధురి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

నాబార్డు డీడీఎం మోపూరు సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న మోపూరు సుబ్బారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: రైతుల అభివృద్ధికి బ్యాంకర్లు సహకరిం చాలని నాబార్డు డీడీఎం మోపూరు సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్ సమావేశ భవనంలో నాబార్డు బ్యాంకర్ల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు వాటర్‌షెడ్స్, ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతు బజార్లు, ఎల్‌ఈడీపీ, ఎంఈడీపీ వాటికి బ్యాంకర్లు సహకరించాలన్నారు. ఏపీజీబీ రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్, కేడీసీసీ జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. డీహెచ్‌ఓ పి.రామాంజనేయులు, ఏడీ వై.భవాని శంకర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీఏ అరుణకుమారి పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

సి.బెళగల్, మార్చి 13: మండలంలోని కొత్తకోట గ్రామ సమీపంలో ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై తెలంగాణ మద్యాన్ని తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని 180 మద్యం సీసాలను, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మద్యం గ్రామాల్లో విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

జన సైనికుల కుటుంబాలకు చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న నాగబాబు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రమాదవశాత్తు మరణించిన జనసైనికుల కుటుంబాలకు బుధవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో రూ.5లక్షల చొప్పున చెక్కును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగ బాబు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మ డి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు, నియోజకవర్గ ఇన్ చార్జిలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కోడుమూరు(రూరల్), మార్చి 13: నీళ్లు తాపేందుకు తరలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గొర్రెలు ఒకదానిపై ఒకటిపడి మృతి చెందిన ఘటన ప్యాలకుర్తిలో జరిగింది. బుధవారం మధ్యాహ్నం గొర్రెల యజమాని నాగేష్ జీవాలకు నీళ్లు తాపేందుకు ఓ వ్యవసాయ బావి వద్దకు తరలిస్తున్నారు. అయితే దారిలో ఎల్లెల్సీ కాలువ దాటాల్సి రావడంతో మళ్లించాడు. అయితే గొర్రెలు కాలువ దాటే క్రమంలో ఒకదానిపై ఒకటి పడడంతో ఊపిరాడక సుమారు 12 గొర్రెలు మృతి చెందాయి. నాగేష్ మరికొందరు కాపరులు వెంటనే తేరుకుని రక్షించారు. ఎల్లెల్సీలో నీళ్లు లేక ఒట్టిపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని నాగేష్ వాపోయారు. సుమారు రూ 1.5 లక్షలు నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యాడు. బాధితుడిని గొర్లసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రమద్దిలేటి పరామర్శించారు. వేసవి దృష్ట్యా కుంటలు, చెక్‌డ్యాంలను నీటితో నింపి జీవాల దాహార్తి తీర్చాలని ఆయన అధికారులను కోరారు.

'టీడీపీ మేనిఫెస్టోలో బ్రాహ్మణులకు ప్రత్యేక పథకాలు చేర్చాలి'

కర్నూలు(కల్చరల్), మార్చి 13: తెలుగుదేశం పార్టీ మేనిషెస్టోలో పేద బ్రాహ్మణుల పురోగతికి ఉపయోగపడే ప్రత్యేక పథకాలు చేర్చాలని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం రాత్రి మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో, టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ అధ్యక్షతన వివిధ బ్రాహ్మణ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణులకు సంబంధించిన సమస్యలపై చర్చించినట్లు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. నాయకులు టి.రవిచంద్ర శర్మ, డి.ఆనందరావు, మారుతి శర్మ పాల్గొన్నారు.

● చంద్రబాబు బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద బ్రాహ్మణులను ఆదుకున్నారని అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం (ఏబీబీఎం) జిల్లా అధ్యక్షుడు దేవళ్ల వసంత సాయినాథ శర్మ అన్నారు. మంగళగిరిలో జరిగిన సమావేశంలో ఏబీబీ ఎం జాతీయ నాయకుల సూచనలతో ఏబీబీఎం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌లతో కలిసి టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీకి వివిధ సమస్యలను నివేదించినట్లు సాయినాథ శర్మ తెలిపారు.

ఉద్యోగ నియామక ఉత్తర్వులు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా సచివాలయ ఉద్యోగాలకు క్వాలిఫై అయిన ఏడుగురు అభ్యర్థులు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. బుధవారం కార్యాలయంలో నగర మేయర్ బీవై.రామయ్య, కమిషనర్ భార్గవతేజ చేతుల మీదుగా ఉత్తర్వులు తీసుకున్నారు. కార్యక్రమంలో టీపీ ఆర్‌ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ మంజూర్ బాషా పాల్గొన్నారు.

జాబు కార్డు ఉన్నవారే పనికి హాజరు కావాలి

సి.బెళగల్, మార్చి 13: జాబు కార్డు ఉన్న వారు మాత్రమే ఉపాధి పనికి హాజరయ్యేలా చూడాలని ఏపీవో లక్ష్మన్న ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఈసీ పృథ్వీరాజ్, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఆలూరు చెరువులోంచి గ్రావెల్ తరలింపు

- ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ నిర్వాహకుల దందా
- అడ్డుకున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్
- పోలీసులకు ఫిర్యాదుతో ఆరు ట్రాక్టర్లు స్వాధీనం

ఆలూరు, మార్చి 13: ఆలూరు పట్టణంలోని చెరువులో వారం రోజులుగా ఎక్స్‌కవేటర్ నిర్వాహకులు ట్రాక్టర్ డ్రైవర్లు కలసి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూర్ కిషోర్ బుధవారం గ్రామపంచాయతీ సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తవ్వకాల దగ్గరకు వెళ్లి అడ్డుకున్నారు. ఆరు ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో ఎక్స్‌కవేటర్ నిర్వాహకులు రెడ్డి, ట్రాక్టర్ డ్రైవర్లు నాయకుల హస్తం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

ఘనంగా బంగారమ్మ, అంకాలమ్మ దేవర

పత్తికొండ,మార్చి13: స్థానిక గ్రామదేవతలు బంగారమ్మ, అంకాలమ్మ దేవర ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో పోతుబలితో దేవర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామపెద్దలు ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం మొదటి బోనాలు బంగారమ్మ, అంకాలమ్మ దేవాలయానికి చేరుకోగా పోతుబలి పూర్తిచేశారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు రైతు కుటుంబాలు బోనాలు సమర్పించారు. పత్తికొండ దేవర ఉత్సవాలకు హాజరైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు టీడీపీ నాయకులు సింగంశ్రీను, ఎరుకలచెరువు సురేంద్ర, రమేష్ ఘనస్వాగతం పలికారు.

ఎం. అగ్రహారంలో : పత్తికొండ మండలం మండిగిరి అగ్రహారంలో సుంకులాపరమేశ్వరి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు బోనాలతో డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఉపాధి పనులు గుర్తించండి

మద్దికెర, మార్చి 13: వ్యవసాయ పనులు ముగిసాయని, ఉపాధి పనులు కల్పించేందుకు పనులు గుర్తించాలని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. మండలంలో వలసల నివారణ కోసం అడిగిన కూలీలందరికి పనులు కల్పించాలన్నారు. ఏప్రిల్ నెల వంద శాతం ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. మేటీలు రైతుల నుంచి పొలాల వివరాలు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు.

పనులు కల్పిస్తాం

తుగ్గలి : జాతీయ ఉపాధి హామీ పథకం కింద అన్ని గ్రామాల్లో పనులు కల్పిస్తామని, వలసల వెళ్లవద్దని ఏపీవో రామక్రిష్ణయాదవ్ అన్నారు. స్థానిక ఏపీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డిమాండ్ ఇచ్చిన ప్రతి కూలికి పనులు కల్పించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసీ ప్రదీప్ కుమార్, టీఏలు చిన్నవెంకప్ప, రామాంజనేయులు, ఫరీదప్ప, రాజశేఖర్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు రెండు కేంద్రాలు

మద్దికెర, మార్చి 13: మండలంలో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు మద్దికెరలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాల, ఫ్రెండ్స్ విద్యానికేతన్, విద్యాసాయి, ఎం.అగ్రహారం జిల్లా పరిషత్, పెరవలి జిల్లా పరిషత్ పాఠశాలల్లో మొత్తం 472 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నట్లు తెలిపారు. పెరవలి జడ్పీ పాఠశాలలో చదువుతున్న వంద మంది విద్యార్థులకు తుగ్గలి మండలం నోవీ పాఠశాలను కేంద్రంగా ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన 372 మంది విద్యార్థులు మద్దికెరలోని జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు.

టీడీపీ, జనసేన అభ్యర్థి గెలుపునకు పని చేయాలి

గోనెగండ్ల, మార్చి 13: ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఉమ్మడి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రేఖాగౌడ్ కోరారు. బుధవారం మండల పరిధిలోని కులుమాల గ్రామంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఏకైక లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ఉమ్మడి అజెండాతో అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ జోన్ నాయకుడు పవన్‌కుమార్, జనసేన నాయకులు గానుగబాషా, కర్ణం రవి, షబ్బీర్, మునిస్వామి, మాలిక్ రామాంజినేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

ఉరుకుంద హుండీ రూ.58 లక్షలు

కౌతాళం, మార్చి 13: మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో రెండో రోజు బుధవారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పాలక మండలి చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలు నగదు రూపంలో రూ.58,64,029, విదేశీ కరెన్సీ నోట్‌లు 13, బంగారం 36.5గ్రాములు, వెండి 27కేజీల 740గ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదోని గ్రూపు టెంపుల్స్ ఈఓ రాంప్రసాద్, ఆలయ పాలక మండలి సభ్యులు విజయేంద్ర రెడ్డి, నరసింహులు, రెడ్డి గీత, లక్ష్మిరెడ్డి, నరసమ్మ పాల్గొన్నారు.

కడిమెట్లలో ఘనంగా దేవర

ఎమ్మిగనూరు రూరల్ , మార్చి13: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో వెలసిన గ్రామ దేవత మారెమ్మవ్వ దేవర మహోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, ప్రత్యేక అలంకరణ చేశారు.

నేడు గూళ్యం రథోత్సవం

హాలహర్వి, మార్చి 13: గూళ్యంలో వెలసిన గాదిలింగేశ్వరస్వామి జోడు రథోత్సవాలను నేడు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో రాధాకృష్ణ బుధవారం తెలిపారు. జోడు రథాలను సిద్ధం చేశామని, నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

మంత్రాలయం ఎమ్మెల్యేకు మాతృవియోగం

మంత్రాలయం, మార్చి 13: మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తల్లి పాటిల్ లలితమ్మ (85) బుధవారం రాత్రి మృతి చెందారు. పాటిల్ లలితమ్మకు ఆరుగురు కుమారులు. వీరిలో ఒకరు మృతి చెందగా ఐదుగురు అన్నదమ్ములు రాజకీయాల్లో వివిధ హోదాల్లో ఉన్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, గుంతకలు ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, అనంతపురం ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడి అన్నదమ్ములు. వీరి తల్లి లలితమ్మ మరణవార్త తెలుసుకున్న ఆయా నియోజకవర్గాల్లోని నాయకులు, కార్యకర్తలు ఆమెకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలు సొంత గ్రామమైన ఉరవకొండ నియోజకవర్గం కొనగండ్లలో చేయనున్నారు.



పాటిల్ లలితమ్మ

మైనార్టీలకు జగన్ చేసింది శూన్యం

ఎమ్మిగనూరులో బీవీ జయనాగేశ్వరరెడ్డి ఇంటింటి ప్రచారం

ఎమ్మిగనూరు/గోనెగండ్ల, మార్చి13: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు సీఎం జగన్ చేసిందేమీలేదని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 17వార్డు మైనార్టీ కాలనీలో బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గోనెగండ్లలో కార్యకర్తలతో కలిసి బీవీ పర్యటించారు. ఎమ్మిగనూరులో ఆయన ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు చేసిందేమీ లేదన్నారు. టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన రంజాన్ తోఫా, పెళ్లికానుక వంటివి రద్దుచేసి ముస్లింలను మోసం చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. అలాగే గోనెగండ్లలో టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గోనెగండ్ల మండల టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యానాయుడు, రమేష్‌నాయుడు, బేతాలబడేసా, భారతం రహంతుల్లా, ఎమ్మిగనూరు వార్డు ఇన్‌చార్జి బోయ జయన్న, మాజీ కౌన్సిలర్ లక్ష్మి, నాయకులు కొండయ్యచౌదరి, రామదాసు గౌడ్, దయాసాగర్, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, మిఠాయి నరసింహులు, సుందరరాజు, కృష్ణతేజ నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు మైనార్టీ కాలనీలో మాట్లాడుతున్న బీవీ

ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన

ఆదోని, మార్చి 13: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు గాను, 26 మంది సెక్టర్ ఆఫీసర్లు, ఇద్దరు రిజర్వ్ కలిపి 28 మంది సెక్టోరల్ ఆఫీసర్లను నియమిస్తారన్నారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ సామగ్రి, చేయాల్సిన, చేయకూడని, చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టోరల్ అధికారులు పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ ఎన్నికల కమిషన్, నిర్వహించిన నిబంధనలు ఉండేటట్టు ఒకటికి రెండుసార్లు చూసుకోవాలని సూచించారు.

రాజకీయ నేతలకు అవగాహన అవసరం: రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల నియమావళిపై స్పష్టత అవసరమని సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు నియోజకవర్గ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన విధానాలు, నియమాలపై పొలిటికల్ పార్టీలకు, మీడియా ప్రతినిధులకు కూడా స్పష్టత ఉండాలనే ఉద్దేశంతో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై నిర్లక్ష్యం వద్దు : ఆర్వో

మంత్రాలయం, మార్చి 13: మంత్రాలయం నియోజకవర్గంలో బీఎల్వోలు ఎన్నికల బూత్‌లలో ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని మంత్రాలయం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి, మంత్రాలయం తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి హెచ్చరించారు. బుధవారం భూరమణ కళ్యాణ మండపంలో మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాల్లోని బీఎల్వోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.45 లక్షలు మాత్రమే ఉంటుందన్నారు. ఒక్కో బ్యాలెట్ నమూనాల్లో 15 మంది అభ్యర్థులు, ఒకటి నోటా కలిపి 16 గుర్తులు ఉంటాయని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల డిటీ శశిశేఖర్ రావు, కోసిగి తహసీల్దార్ మురళి, కౌతాళం తహసీల్దార్ అలెగ్జాండర్, నాగరాజు, ఆదామ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరిని మభ్యపెట్టేందుకు భూమిపూజ?

టీడీపీ హయాంలోని పనులకు వైసీపీ కలరింగ్

గోనెగండ్ల, మార్చి 13: టీడీపీ హయంలో చేసిన భూమి పూజ చేసిన స్కీంలకు వైసీపీ ప్రభుత్వం మళ్లీ భూమి పూజ కార్యక్రమాలు హడావుడిగా చేపడుతుంది. ఎవరిని మభ్యపెంటేందుకు ఈ భూమి పూజ పనులు చేపడుతున్నారో ప్రజలకు అంతుచిక్కడం లేదు. మండల పరిధిలోని 11 గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం మల్టీవిలేజస్కీం కింద 13.50 కోట్లు విడుదల చేసింది. ఈ పనులను అప్పటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి 2017 ఏప్రిల్ నెలలో భూమి పూజ చేసి ప్రారంభించారు. అప్పట్లో పనులు కూడా వేగంగా జరిగాయి. ఈ పథకం కింద హెచ్ కైరవాడి, గాజులదిన్నె, పుట్టపాశం, పెద్దనేలటూరు, ఎర్రబాడు, కులుమాల గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు నిర్మాణ పనులు కూడా చేపట్టారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారులోకి రావటంతో ఈ పథకానికి సంబంధించిన పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్ల పాటు పట్టించుకోని వైసీపీ త్వరలో నోటిఫికేషన్ రానున్న తరుణంలో బుధవారం పనులకు శ్రీకారం చుట్టారు. 11 గ్రామాలకు అదనంగా మరో మూడు గ్రామాలను చేర్చి ఈ పనులన్నీ తామే చేస్తున్నట్లు కలరింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టారేణుక మళ్లీ భూమి పూజ చేసి వారు నవ్వులపాలు కావాల్సి వచ్చింది.



మళ్లీ భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, బుట్టారేణుక



2017లో మల్టీ విలేజస్ స్కీంకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే బీవీ(ఫైల్)

ఎన్నిసార్లు భూమి పూజ చేస్తారు: రామకృష్ణ, తెలుగుయువత

ఎంవీఎస్‌స్కీం పనులకుగాను 2017లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో పనులు ఆగిపోయాయి. ఈ ఐదేళ్లు ఒక్క రూపాయి కూడా పథకానికి ఖర్చు చేయలేదు. ఎన్నికలు వస్తున్నందున వైసీపీ నాయకులు తాము ఏదో చేశామని చెప్పేందుకే ఇలా భూమిపూజ పనులకు ముందుకొచ్చారు.

పత్తి ధర పైపైకి.... వేరుశనగ పతనం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 13: గత వారం రోజులుగా పత్తి ధర పైపైకి ఎగబాకుతుంది. వేరుశనగ ధరలు మాత్రం దిగజారుతున్నాయి. బుధవారం పత్తి ధర క్వింటాలు గరిష్టంగా రూ.8089 పలకగా, వేరుశనగ ధర గరిష్టంగా రూ6989 పలికింది. పత్తి దిగుబడి రైతులంతా విక్రయంచుకున్నాక, ధరలు పెరుగుతుండడంతో నిరాశ చెందుతున్నారు. బోరుబావులు కింద సాగు చేసిన వేరుశనగ ఇప్పుడిప్పుడే రైతులు విక్రయానికి తీసుకొస్తున్న సమయంలో ధరలు పతనమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 1048 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ట ధర రూ.5,667, గరిష్ట ధర రూ.8,089, 1823 క్వింటాళ్లు వేరుశనగ విక్రయానికి రాగా వాటి క్వింటాల కినిష్ట ధర రూ.3,319, గరిష్ట ధర రూ.6,989 పలికింది.

ఎండుమిర్చి విక్రయాలు వారంలో రెండు రోజులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 13: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండుమిర్చి క్రయవిక్రయాలు వారంలో రెండు రోజులు జరుగుతాయని కమిషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం యార్డులో ఎండుమిర్చి కొనుగోళ్ల ప్లాట్‌ఫారంను సహాయ కార్యదర్శి శాంత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం ఎండుమిర్చి కొనుగోలు చేయాలని తీర్మానించామని, రైతులు సహకరించాలని కోరారు. బ్యాడిగి, గుంటూరు లాంటి సుదూర మార్కెట్ కమిటీలకు తీసుకెళ్లి నష్టపోవద్దని సూచించారు. గిట్టుబాటు ధర అందించాలన్న ఉద్దేశంతో మార్కెట్ కమిటీలో ఎండుమిర్చి కొనుగోళ్లను ప్రారంభించామన్నారు. అసోసియేషన్ నాయకులు వీరభద్ర గౌడ్, రాజా గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆలూరు, మార్చి 13: వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే వేదవతి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో ఆయనను నియోజకవర్గ టీడీపీ నాయకులతో కలిసి తాగునీటి సమస్యపై మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వేదవతి ప్రాజెక్ట్ నిర్మాణానికి అడుగులు పడ్డయన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా నామమాత్రంగా పనులు ఆరంభించి వదిలేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆలూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగర డోన ప్రాజెక్టల నిర్మాణాలు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : కేఈ

పత్తికొండ, మార్చి 13 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పత్తికొండ మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ కడవల సుధాకర్, నాయకులు మోహన్, పరమేశు, ఈశ్వరప్ప, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధికి వైసీపీ చేసిందేమీ లేదు : టీడీపీ

ఎమ్మిగనూరు, మార్చి 13: ఈ ఐదేళ్ల కాలంలో చేనేతకార్మికులకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని టీడీపీ నాయకులు మాచాని సోంనాథ్ అన్నారు. బుధవారం హెచ్‌బీఎస్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పద్మశ్రీ మాచాని సోమప్ప ఎక్కడైతే అభివృద్ధిని వదిలేశారో వాటన్నింటిని ముందుకు తీసుకెళ్తానంటూ బుట్టారేణుక మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఆమె ఎంపీగా ఉన్న సమయంలో నాగలదిన్నె గ్రామాన్ని దత్తతకు తీసుకొని గ్రామానికి చేసిందేమీ లేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఎమ్మిగనూరు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సమావేశంలో నాయకులు మాచాని శివకుమార్, గడిగే సుధాకర్, దానకర్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారంటీ

వెల్దుర్తి, మార్చి, 13 : పట్టణంలో స్థానిక 3, 4 వార్డుల్లో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బలరాంగౌడ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు అరాచక పాలనను చవిచూశారన్నారు.

వందే భారత్‌కు ఆదోనిలో స్టాపింగ్ ఇవ్వాలి

ఆదోని టౌన్, మార్చి 13: కల్బురిగి నుంచి బెంగుళూరుకు ఆదోని పట్టణం మీదుగా ఈ నెల 12న ప్రారంభం చేసిన వందే భారత్ రైలుకు ఆదోని రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా మండలి సభ్యుడు నసీరుద్దీన్ పటల్ రైల్వే అధికారులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వ్యాపార రీత్యా రెండవ ముంబయిగా పేరు పొంది, రెండు లక్షలకు పైగా జనాభా ఉన్న ఆదోని పట్టణం నుంచి నిత్యం అనేక మంది వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు బెంగుళూరుకు వెళ్తుంటారని అన్నారు. అలాగే కల్బురిగిలోని ప్రముఖ దర్గాను సందర్శించడానికి మైనారిటీలు తరుచుగా రాకపోకలను సాగిస్తుంటారని, స్టాపింగ్ ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని రైల్వే జీఎంకు లేక రాసినట్లు ఆయన తెలిపారు.

5న వాహనాల వేలం

ఎమ్మిగనూరుటౌన్, మార్చి 13: సెబ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 15న సెబ్ స్టేషన్ దగ్గర బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎమ్మిగనూరు సెబ్ సీఐ భార్గవరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెబ్ స్టేషన్ దగ్గర హాజరై వాహనం అప్‌సెట్ ప్రైజ్‌లో 10 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేసి వేలం పాల్గొనాలని తెలిపారు. వేలం పాటలో వాహనాలు పొందిన వారు వెంటనే ప్రభుత్వానికి వేలం పాటమొత్తం, జీఎస్టీ మొత్తాన్ని చలాన రూపంలో చెల్లించి వాహనాన్ని తీసుకోవాలని సూచించారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

పెద్దకడుబూరు, మార్చి13: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం దరిచేరదని సీడీపీఓ నాగమణి, ఎంపీపీ శ్రీవిద్య అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా గంగా భవాని క్షేత్ర ముఖద్వారం ప్రారంభం

పెద్దకడుబూరు, మార్చి13:;బాపురం గ్రామంలోని గంగా భవాని క్షేత్ర ముఖ ద్వారం మఠం పీఠాధిపతి బసలింగమ్మవ్వ ప్రారంభించారు. బుధవారం ఆలయం నుంచి చిన్నారులు, మహిళలు కలశాలతో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆదోని ప్రధాన రహదారిలోని చిన్నతుంబళం క్రాస్ రోడ్డులో నిర్మించిన క్షేత్ర ముఖ ద్వారం వరకు భక్తి శ్రద్ధలతో సాగారు. ముఖ ద్వారం పై ఉంచే కలశాలను వేద పండితులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖద్వారం పై ప్రతిష్ఠించారు. టీడీపీ తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ప్రైవేటు అంబులెన్స్

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరు రూరల్ , మార్చి13: మండల పరిధిలోని బనవాసి గురుకుల పాఠశాల సమీపంలో వంశీకృష్ణ స్పెషాలిటీ ఆస్పత్రి అంబులెన్స్ బుధవారం ఓ చెట్టును ఢీకొంది. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు అంబులెన్స్ ఆదోని వైపు నుంచి వస్తుండగా బనవాసి గురుకుల పాఠశాల సమీపానికి రాగానే డ్రైవర్ అదుపు తప్పి రోడ్డు పక్కలో ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రవి ఎడమకాలికి తీవ్ర గాయమైంది. వాహనంలో ఇరుక్కున్న డ్రైవర్ రవిని సీఐ మోహన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది సుధాకర్, కృష్ణ లతో పాటు స్థానికులు బయటకు తీశారు. డ్రైవర్ రవిని సీఐ మోహన్‌రెడ్డి చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా సుంకులమ్మ దేవర

దేవనకొండ ,మార్చి 13 : మండలంలోని దుప్పనగుర్తిలో బుధవారం సుంకులమ్మ ,మారెమ్మ దేవర మహోత్సవం వైభవంగా జరిగింది.;సుంకులమ్మ ,మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలోని ప్రజలు భోనాలతో అమ్మవార్లకి నైవైద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గోనెగండ్ల, మార్చి 13: ప్రజలు వచ్చే ఎన్నికల్లో ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కన్నూరు గ్రామంలో సెంట్రల్ ఫోర్స్ ఎస్ఎస్‌బీ, గోనెగండ్ల పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలోని ని పురవీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలకు తోడుగా పోలీసులు ఉన్నారని ప్రజలలో నమ్మకం కలిగించేందుకు గాను కవాతు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండర్ రాజేష్, సిబ్బంది, పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన పాలకులు

మంత్రాలయం, మార్చి 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవడం లేదని, వచ్చే ఎన్నికల్లో వారిని గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ అన్నారు. బుధవారం సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఏఐకేఎఫ్ మండలంలోని మాలపల్లి గ్రామంలో ధర్నా నిర్వహించారు. రైతులకు వేలాది ఎకరాల్లో నష్టం వాటిల్లినా వారిని పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలు రైతులను మోసం చేసి అధికారంలోకి రావాలని చూస్తున్నాయని విమర్శించారు. రైతు సంఘం నాయకులు పెద్దహుశేనప్ప, ఈరన్న, భాస్కర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారు..

మద్దికెర, మార్చి 13: మండలంలోని మదనంతపురం గ్రామంలో గుక్కెడు తాగునీరు కోసం ప్రజలు అల్లాడుతున్నారని పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మదనంతపురం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు దేవేంద్ర అన్నారు. బుధవారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్యతో పాటు డ్రెయిన్లు శుభ్రం చేయక ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమస్యలను ఈవోఆర్‌డీ మద్దిలేటిస్వామి దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సీఎం జగన్

మద్దికెర, మార్చి 13: ఒక్క చాన్స్ అంటూ ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశార టీడీపీ సోషల్‌మీడియా కన్వీనర్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంద్ కుమార్ అన్నారు. బుధవారం ఎం.అగ్రహారం ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. టీడీపీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో మరింత చేరువవుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ

మంత్రాలయం, మార్చి 13: మండలంలోని సూగూరు సమీపంలో ఎస్ఎస్ ట్యాంకు వద్ద రూ.1.50 కోట్లతో 33/11లో 1.50 ఎకరాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. బుధవారం ట్రాన్స్‌కో ఏడీఈ విశ్వశాంతి స్వరూప్, ఏఈ గోవింద ఆధ్వర్యంలో టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, కర్నూలు, ఎమ్మిగనూరు ఈఈలు ఓబులేసు, రాజేష్, కర్నూలు ఏడీఏ ఎల్లప్ప గడ్డపార పట్టి భూమి పూజ చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం పూర్తయితే.. లోఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని, త్వరితగతి పనులు పూర్తి చేసి గ్రామ ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని తెలిపారు.

ముస్లింలకు టీడీపీ నాయకుడి ఇఫ్తార్

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 13: రంజాన్ మాసంలో ఉపవాసమున్న ముస్లింలకు 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. హిందూ ముస్లిం సోదర భావంతో కలిసి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఏటా రంజన్ మాసంలో తమ వార్డులోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నానని పేర్కొన్నారు.

అంతా మా ఇష్టం...

- కోసిగి సచివాలయం-4కి తాళం

కోసిగి, మార్చి 13: అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగే వారెవరు..? అన్నట్లు ఉంది సచివాలయ ఉద్యోగుల తీరు. బుధవారం కోసిగిలోని సచివాలయం-4 తాళం తెరవలేదు. ఇక్కడ ఎనిమిది మంది ఉద్యోగస్థులు విధులు నిర్వహిస్తున్నా బుధవారం ఒక్కరు కూడా విధులకు హాజరు కాలేదు. కోసిగిలోని 5 సచివాలయాలకు కలిపి సచివాలయం-4లో జగనన్న కాలనీ హౌస్ సైట్ పట్టాలకు రిజిస్ట్రేషన్ కాపీలు ఈ సచివాలయం ద్వారానే పంపిణీ చేస్తున్నారు.



ఉదయం 10 గంటలకు వచ్చా..

ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాల కోసం సచివాలయానికి 10 గంటలకు వచ్చాను. కూలి పనులు మానుకొని రెండు రోజులుగా తిరుగుతున్నా స్పందన లేదు. కళ్లు తిరిగి కూర్చున్నాను., స్థానికులు వచ్చి తాగునీరు అందించారు.

– శంకరమ్మ, 4వ వార్డు కోసిగి